క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌లో ఎంపీ జీవీఎల్ తనిఖీలు



ప్రయాణికుడితో మాట్లాడుతున్న జీవీఎల్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఉదయం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లో ప్రయాణికులు, పారిశుద్ధ్య కార్మికులతో ఆయన మాట్లాడారు. పలు సమస్యలను ప్రయాణికులు జీవీఎల్‌కు తెలియజేయగా.. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బస్టాప్‌లో బెంచీ శిథిలం



గురుద్వారా బస్టాప్‌లో విరిగిన బెంచీ

సీతమ్మధార: గురుద్వారా జంక్షన్ బస్టాప్‌లో ఉన్న ఇనుప బెంచీ విరిగిపోవడంతో ప్రయాణికులు కూర్చునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా ఈ పరిస్థితి ఉంది. ఈ బెంచీ చోరీకి గురికాక ముందే అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. గతంలో అక్కడి డివైడర్‌కు ఉన్న ఇనుప చువ్వలను దొంగిలించిన సంగతి తెలిసిందే. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మర్రిపాలెం: ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్–4లో నివసిస్తున్న గొర్లె పవన్(29) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్యతో ఎటువంటి విభేదాలు లేవు. బీటెక్ చదివి కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. ప్రస్తుతం ఉద్యోగం ఏమీ చేయడం లేదు. శుక్రవారం మృతుడి తండ్రి గొర్లె రామారావు ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్దం కేసు దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందుల లేక అనారోగ్య సమస్యలా అన్న కోణంలో మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

ఆరిలోవ: ప్రజలు నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ రోహిత్ దురేజా తెలిపారు. 38వ నేత్రదాన పక్షోత్సవం శుక్రవారం హనుమంతవాక వద్ద ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 8 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేస్తామని తనకు తాను ప్రతిజ్ఞ చేసుకోవాలన్నారు. కార్నియా అంధత్వ నివారణకు అంతా సహకరించాలని ఆయన కోరారు. మరణానంతరం కార్నియా దానం చేయడానికి అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కంటి వైద్యులు పాల్గొన్నారు.

కమనీయం.. అప్పన్న కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

- అమ్మవారికి మహిళల విశేష పూజలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు



వరలక్ష్మీ అలంకారంలో పార్వతీదేవి



గొల్ల కంచరపాలెంలో ధనలక్ష్మీదేవి



శ్రీనివాసనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవార్లకు కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సీతంపేట: సౌభాగ్యం, సిరిసంపదలను ప్రసాదించే వరలక్ష్మీ వ్రతాన్ని నియోజకవర్గంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠం, సీతంపేట పార్వతీశ్వరాలయం, రామచంద్రానగర్ మహాలక్ష్మి సహిత శివసాయి ఆలయం, శ్రీనివాసనగర్ ప్రసన్న వేంకటేశ్వ స్వామి ఆలయాల్లో అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు.

లలితా పీఠానికి పోటెత్తిన భక్తులు..

లలితా పీఠంలో లలితాదేవి దర్శనానికి సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం వద్ద భక్తులు క్యూ కట్టారు. అమ్మవారిని పూలమాలలు, పట్టు వస్త్రాలు, స్వర్ణాభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు విశేషంగా కుంకుమ పూజలు జరిపారు. మధ్యాహ్నం పీఠంలో నిర్వహించిన భారీ అన్నదానంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- రామచంద్రానగర్‌లోని మహాలక్ష్మి సహిత శివసాయి ఆలయంలో కొలువైన అమ్మవారికి మహిళలు విశేష పూజలు చేశారు. అర్చకులు దూప, దీప, నైవేద్యాలు, నక్షత్ర హారతి సమర్పించారు. మహిళలు లలితా సహస్ర నామం పఠించారు.
- పార్వతీశ్వరాలయంలో పార్వతీదేవి శుక్రవారం వరలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ అమ్మవారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

సామూహిక కుంకుమ పూజలు

అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో కొలువైన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు కూర్మనాథ ఆచార్యులు పర్యవేక్షణలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేంకటేశ్వరుడు, గోదాదేవి, అలమేలు మంగమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవార్లను 101 కిలోల పసుపు కొమ్ములతో పూజించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, పసుపు, కుంకుమ అందజేశారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

కంచరపాలెం: కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గొల్ల కంచరపాలెం ధనలక్ష్మీదేవి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్యామాచార్యులు అమ్మవారిని విశేషంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



రామచంద్రానగర్ ఆలయంలో మహాలక్ష్మికి పూజలు చేస్తున్న అర్చకుడు



లలితా నగర్ లలితాదేవి ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు

జాబ్ మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. రక్షిత డ్రగ్స్, ఏడీఎల్ ఆగ్రో ఫార్మా, ఆటోమోటివ్ మ్యానిఫ్యాక్చర్స్, రక్షిత్ ఫార్మాసిటికల్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మొదలగు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 282 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు జరిగాయి. వీటికి 297 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 74 మంది ఎంపికై నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఎంపికైన వారి సర్టిఫికెట్లను పరిశీలించి, సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వాటిలో నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎ.సంగీత, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫోర్త్‌టౌన్ సీఐగా విజయకుమార్ బాధ్యతల స్వీకరణ



విధుల్లో సీఐ విజయకుమార్

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా ఎస్.విజయకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన మొదటి సారి పీఎస్‌ఐ కొత్తూరు, ఎస్‌ఐగా బత్తిలి, సంతబొమ్మలి, ఎచ్చెర్ల, హిరమండలం, స్పెషల్ బ్రాంచ్, జీఆర్‌పీ, సీఐగా ప్రమోషన్‌తో శ్రీకాకుళం ట్రాఫిక్, రణస్థలం(జేఆర్ పురం), నక్కపల్లి, సీఐడీ, ద్వారకా క్రైం, కంచరపాలెం పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం బదిలీపై ఫోర్త్ టౌన్ సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా విజయకుమార్‌ను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

అంతర్జాతీయ విద్యకు ఏయూ ప్రోత్సాహం

బీచ్ రోడ్డు: అంతర్జాతీయ విద్యను ఏయూ విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో ప్రోత్సహిస్తున్నామని వర్సిటీ రెక్టర్ మమత తెలిపారు. శుక్రవారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో జరిగిన ఇండో–యూకే ఎడ్యుకేషన్ ఫోరం సదస్సును ఆమె ప్రారంభించారు. అనంతరం రెక్టార్ మాట్లాడుతూ అంతర్జాతీయ విద్యను ప్రోత్సహించడంలో భాగంగా అనేక విదేశీ విద్యా సంస్థలతో ఎంఓయూలు చేసుకుంటున్నామని చెప్పారు. శుక్రవారం కూడా యూకేకు చెందిన రెండు యూనివర్సిటీలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా ఏయూ ముందుకు సాగుతుందన్నారు. యూకేలో అందిస్తున్న కోర్సులపై అవగాహన కల్పించారు.

కోచింగ్ సెంటర్‌పై విద్యార్థుల ఫిర్యాదు

సీతమ్మధార: ద్వారకానగర్ మూడో లేన్‌లోని మహేంద్రస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులపై ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆ సెంటర్ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మహేంద్రస్ కోచింగ్ సెంటర్‌లో కొందరు విద్యార్థులు చేరారు. ఆఫ్‌లైన్‌లో జరుగుతున్న కోచింగ్‌ను ఆన్‌లైన్‌లో ఇస్తామని సెంటర్ మేనేజర్ చెప్పారు. తమకు ఆఫ్‌లైన్‌లోనే కోచింగ్ కావాలని విద్యార్థులు కోరారు. యాజమాన్యం కుదరదని చెప్పడంతో విద్యార్థులు ద్వారకా పీఎస్‌లో సీఐ సింహాద్రినాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆయన కోచింగ్ సెంటర్ యాజమాన్యాన్ని పిలిపించి విచారించారు. 15 మంది కొత్త బ్యాచ్ వరకు మూడు నెలల పాటు ఆఫ్‌లైన్‌లో కోచింగ్ ఇస్తామని సెంటర్ నిర్వాహకులు హామీ ఇచ్చారు.

లక్ష్మీదేవి వెండి ప్రతిమల బహూకరణ



భక్తులకు వెండి ప్రతిమలు బహూకరిస్తున్న ఈవో శిరీష

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న ఇద్దరు భక్తులకు లక్ష్మీదేవి వెండి ప్రతిమలు లక్కీ డ్రా తీసి ఈవో కె.శిరీష చేతుల మీదుగా అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు రక్షణ

- తీరం చెంతన ప్రతిమలకు గొడుగుల ఏర్పాటు
- రాత్రి వేళ కనువిందు చేసేలా విద్యుత్ వెలుగులు
- పనులు పూర్తి చేసిన విశాఖ పోర్టు ట్రస్ట్ అధికారులు



బీచ్ రోడ్డులో ఆదర్శమూర్తుల విగ్రహాలకు రక్షణగా ఏర్పాటు చేసిన గొడుగులు

బీచ్ రోడ్డు: దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన యోధులు, సమాజాభివృద్ధికి శ్రమించిన మానవతావాదులు, పలు రంగాల్లో విశేష సేవలందించిన ఆదర్శమూర్తులు, రాజకీయవేత్తలు ఇలా ఎంతో మంది మహనీయుల విగ్రహాలు సాగర తీరాన కొలువుదీరి ఉన్నాయి. విగ్రహాలను అయితే ఏర్పాటు చేశారు కానీ.. వాటి రక్షణ, పరిశుభ్రత, విద్యుత్ వెలుగుల విషయాన్ని మాత్రం గాలికి వదిలేశారు. ఇప్పుడు విశాఖ పోర్టు ట్రస్ట్ ఆదర్శమూర్తులకు అండగా నిలిచింది. విగ్రహాలకు గొడుగులు, లైటింగ్స్ ఏర్పాటు చేసి సందర్శకులతో అభినందనలు అందుకుంటోంది. తీరం చెంతన కొలువుదీరిన మహనీయుల విగ్రహాలు సరికొత్తగా దర్శనమిస్తున్నాయి.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పాడై పోతున్న విగ్రహాల రక్షణకు పోర్టు ట్రస్ట్ అధికారులు చర్యలు చేపట్టారు.

అపరిశుభ్రత నుంచి విముక్తి

సాగరతీరంలో ఏర్పాటు చేసిన విగ్రహాలకు ఎటువంటి నీడ, రక్షణ గోడ లేదు. దీంతో విగ్రహాలపై పక్షులు వాలి పాడుచేస్తున్నాయి. అవి కళావిహీనంగా దర్శనమివ్వడంతో సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాలను చూసేందుకు ఆసక్తి కూడా చూపడం లేదు. మహనీయుల జయంతి, వర్ధంతి రోజుల్లో నివాళులర్పించే సమయంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు పోర్టు ట్రస్ట్ అధికారులు పరిష్కారం చూపుతూ విగ్రహాలకు రక్షణ చర్యలు చేపట్టారు. తీరంలో ఉన్న అన్ని విగ్రహాలకు గొడుగులు ఏర్పాటు చేశారు. దీంతో ఆదర్శమూర్తులకు నీడతో పాటు, పక్షుల బెడద నుంచి విముక్తి కలిగింది. విగ్రహాలు చూడడానికి చాలా పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

విద్యుత్ కాంతుల్లో మహనీయులు

సందర్శకులకు మహనీయుల కోసం తెలియాలని విగ్రహాలను ఏర్పాటు చేశారు. అయితే తీరానికి సందర్శకులు ఎక్కువగా సాయంత్రం, రాత్రి సమయంలో వస్తారు. తీరంలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద విద్యుత్ వెలుగులు లేకపోవడంతో అటువైపు వెళ్లేందుకు సందర్శకులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పుడు మహనీయుల విగ్రహాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ముఖం కనిపించేలా ఒక లైట్, వారి వివరాలు తెలిపే పలక కనిపించేలా ఒక లైట్‌ను ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో కూడా ఆదర్శమూర్తుల కోసం తెలుసుకునే అవకాశం కలిగిందని సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గొడుగు, విద్యుత్ వెలుగులో మహనీయుడు

ముఖ్యమంత్రి జగన్‌తో..





కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణిలను పరిచయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయనగరం పర్యటన ముగించుకొని విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న సందర్భంగా ఆయనను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎయిర్‌పోర్టులో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వారిని సీఎం పరిచయం చేశారు.

రైల్వే టీటీఈకి అభినందన



రైలులో పోగొట్టుకున్న బంగారు ఉంగరాన్ని ప్రయాణికుడికి అందిస్తున్న టీటీఈ డి.ఆర్.ఎం.రెడ్డి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్, కమర్షియల్ విభాగంలో ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్(టీటీఈ)గా విధులు నిర్వర్తిస్తున్న డి.ఆర్.ఎం.రెడ్డి నిజాయితీని పలువురు ప్రశంసించారు. రైల్లో ఓ ప్రయాణికుడు మరచిపోయిన బంగారు ఉంగరాన్ని తిరిగి అతడికి ఆయన అందజేసి నిబద్ధతను చూపారు. వివరాలిలా.. శివ కరణం అనే ప్రయాణికుడు ఈ నెల 23న బెంగళూరూ–హౌరా రైలు థర్డ్ ఏసీ కోచ్‌లో తిరుపతిలో బయలుదేరి 24న విశాఖకు చేరుకున్నాడు. ఇక్కడ గురువారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి రైలు దిగిపోయాడు. కొద్దిసేపటికి తన గోల్డ్ రింగ్ రైలులో పోగొట్టుకున్నట్టు అతడు గుర్తించి లాబీలో ఆన్‌డ్యూటీలో ఉన్న టీటీఈకి సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన ఆయన బెంగళూరూ–హౌరా రైలులో విధి నిర్వహణలో ఉన్న టీటీఈ డి.ఆర్.ఎం.రెడ్డికి సమాచారం చేరవేశారు. ఈయన తక్షణం శివ ప్రయాణించిన బెర్త్ వద్దకు వెళ్లి తనిఖీ చేసి ఉంగరాన్ని కనుగొన్నారు. వెంటనే ఆ ప్రయాణికుడికి దాన్ని అందజేశారు. సుమారు రూ.35 వేల విలువైన తన గోల్డ్ రింగ్ తిరిగి దొరకడంతో శివ సంతోషం వ్యక్తం చేశాడు. రైల్వే టీటీఈ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి టీటీఈ రెడ్డికి అభినందనలు తెలిపారు.

గౌడ ఎడ్యుకేషనల్ అవార్డుల ప్రదానం రేపు



మాట్లాడుతున్న జెర్రిపోతుల ప్రసాద్

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా గౌడ సంఘం ప్రతి ఏటా జరుపుకునే వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 27న గౌడ ఎడ్యుకేషనల్ అవార్డులు, వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు సంఘం గౌరవ అధ్యక్షుడు జెర్రిపోతుల ప్రసాద్, అధ్యక్షుడు మార్గాన రామారావు తెలిపారు. శుక్రవారం కాన్వెంట్ జంక్షన్ సమీపాన గల గౌడ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంఘ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా గౌడ విద్యార్థులకు అవార్డులు అందజేయనున్నట్టు చెప్పారు. అనంతరం వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గౌడ విద్యార్థులు, పరిచయ వేదికను గౌడ సంఘీయులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కామన వెంకట సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ సుందరరావు, కొయ్యల సత్యనారాయణ, నిచ్చనకోళ్ల వెంకటరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నిర్మూలన



39వ వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ అధికారులు

జగదాంబ: వారంలో ఒకరోజు డ్రైడే పాటించటం ద్వారా దోమలను నిర్మూలించవచ్చని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో సత్యనారాయణ అన్నారు. 39వ వార్డు థాంప్సన్ వీధిలో నిర్వహించిన అవగాహన ర్యాలీ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా ప్రబలకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్లలోని నీటి కుండీలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఫ్రిజ్‌ల వెనుక ఉన్న నీటిని కూడా శుభ్రం చేసుకోవాలన్నారు. దోమతెరల ఉపయోగం వల్ల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. పాతటైర్లు, తాగి పడేసిన కొబ్బరిబొండాలు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలన్నారు. నిల్వ నీటిలో లార్వా ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, శానిటరీ సెక్రటరీలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

మద్దిలపాలెం: దోమల నిర్మూలనకు ప్రతి శుక్రవారం అమలు చేస్తున్న డ్రైడే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ రత్నం కోరారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో శుక్రవారం ఆయన పరిశీలించారు. జీవీఎంసీ యాంటి మలేరియా బృందం చేపడుతున్న చర్యలను తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాల్లో ఉన్న నీటి నిల్వల్లో లార్వా ఉన్నదీ లేనిదీ గుర్తించాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారం పైగా నీరు నిల్వ ఉంటే దోమల ఉత్పత్తి అవుతాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ కె.ఎన్.శ్రీనివాసరెడ్డి, రాముునాయుడు, శేషులు, యాంటి లార్వా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆధునిక ఔషధాలతో క్యాన్సర్ నివారణ



డాక్టర్ మాధవిని సన్మానిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట : క్యాన్సర్ వ్యాధి నివారణకు అధునాతన పద్ధతులు, ఔషధాలు వచ్చాయని అమెరికాలో స్థిరపడ్డ ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థిని, ప్రముఖ మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ గొరుసు మాధవి అన్నారు. శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కామన్ టీచింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ×ప్రివెన్షన్ మెడిసిన్–అంకాలజీ×అన్న అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాల వల్ల ప్రపంచంలో క్యాన్సర్ వ్యాధి పెరుగుతోందని అన్నారు. మద్యం, ధూమపానం, వంశపారంపర్యంగా ఈ వ్యాధి సోకుతోందన్నారు. తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు, ఏఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కేవీవీ సుబ్రహ్మణ్యం, కేజీహెచ్ మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, డాక్టర్ పీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవిని ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

కళాభారతిలో నృత్యోత్సవం నేడు

మద్దిలపాలెం: సంస్కృత కథక్ విద్యాలయం ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం పంచ వర్ష నృత్యోత్సవం నిర్వహించనున్నామని నిర్వాహకుడు వెంకటరమణ తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకకు అందరూ ఆహ్వానితులేనన్నారు. కథక్ నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.